
ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

నేనెలా చిత్రపరిశ్రమకొచ్చాను?

సోమయాజులు

జ్యోతిచిత్ర ఆగస్ట్ 8,1980



నేను ముప్పది ఐదు సంవత్సరాలుగా రంగస్థలంపై నటిస్తున్నాను. అందరు తల్లిదండ్రులు తమ పిల్లలు నాటకాలు ఆడతామంటే కోప్పడతారు చెడిపోతారని. కాని – మా అమ్మ మాత్రం ఇందుకు భిన్నంగా మమ్మల్ని ఎంకరేజ్ చేసింది. ఆమె ప్రోత్సాహమే మాకు శ్రీరామ రక్షగా నిలచింది.

నాటకాలు ఆడటం వుంది చూశారూ ఇదొక జబ్బు. ఈ జబ్బు పట్టుకుంది అంటే వదలదు. ముఖానికి రంగు పూసుకుని స్టేజి ఎక్కితే ఒక రకమైన త్రిల్లింగ్ అనిపిస్తుంది. రంగస్థలం మీద ఆ రెండు మూడు గంటలు మనమే రాజులం. మనల్ని నిరోధించే వారెవ్వరూ వుండరు. అలాకాదు ఇలా అని చెప్పేవారు అసలే వుండరు.

మా విశాఖ ప్రాంతంలో డ్రామా నటుడుగా నేను కాస్తో కూస్తో పేరు ప్రఖ్యాతులు సంపాదించాను. బాధ్యతాయుతమైన ఉద్యోగం ఒక ప్రక్క చేస్తూనే మరో ప్రక్క నాటకాల వ్యవహారం చూస్తుండేవాడిని. ఇదిలా కొనసాగుతూ వున్నప్పుడు

విశాఖకు ఒకసారి మిత్రులు యోగి వచ్చారు. వారు తీయబోతున్న చిత్రంలో నాకు అవకాశం ఇవ్వాలనుకుంటున్నట్టు, నన్ను నటించమని వారు కోరారు. నేను ఎటూ చెప్పలేకపోయాను. మిత్రులంతా అవకాశం వెతుక్కుంటూ వచ్చింది తిరస్కరించడం ఏమీ బాగాలేదు అన్నారు. నేనూ ఆలోచనలో పడ్డాను.

నేనూ ఆలోచనలో పడ్డాను. నాటకాలు అయితే ఒక ప్రాంతానికే పరిమితం. కొందరికే తెలియడానికి అవకాశం వుంది. తెరమీద కనపడటం అంటే యావత్ ఆంధ్రప్రదేశ్‌లోనూ పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు అనుకుని సరే అన్నాను.

నా వయసు 52 సంవత్సరాలు. ఈ వయస్సులో నేను చిత్రపరిశ్రమలో కాలుపెట్టడం కడు విడ్డూరంగానే వుంది. అయినా ఇందాక చెప్పానే ఆ "ఇది" నన్ను మాట్లాడనివ్వలేదు. మౌనంగా అంగీకరింపజేసింది.

ఐతే నాలో కాస్త భయం కూడా లేకపోలేదు. నాటకరంగం మీద ఉజ్వలంగా వెలిగి సినిమా రంగానికి వెళ్ళి ఫెయిల్ అయినవారు చాలామంది వున్నారు. నా పరిస్థితి ఏమి కానున్నదో? అనుకోసాగాను.

"ఏమైతేనేం "రారా కృష్ణయ్య" చిత్రంలో నటించాను. చిత్రం షూటింగ్ పూర్తయ్యింది. డబ్బింగ్ జరుగుతోంది. అప్పుడు "శంకరాభరణం"లో సోమయాజులు పాత్రకు తగిన నటుడు కోసం అన్వేషణ జరుగుతోంది. మిత్రుడు బాలసుబ్రహ్మణ్యం విశ్వనాధ్‌గారికి నన్ను రికమెండ్ చేశాడు. విశ్వనాథ్‌గారు నన్ను చూడటం, సెలెక్ట్ చేయడం, నేను "శంకరాభరణం"లో నటించడం మీకు తెలిసిందే.

మొదటి చిత్రం ఎ.సి అయ్యింది. రెండవది డి.సి అయ్యింది.

ఈనాడు అందరి ఆదరాభిమానాలకు పాత్రమయ్యానంటే ఇదంతా నా పూర్వ జన్మ సుకృతం. నా 35 సంవత్సరాల రంగస్థల కృషి ఫలించి ఆ కాశీవిశ్వనాధుడే ఈ కాశీ విశ్వనాథ్‌కి చెప్పి వుంటాడేమోనని నా అనుమానం. నా జన్మ ధన్యమయ్యింది.

భగీరథ.

Post your comments